పెరిగిన 'జూ' ప్రవేశ ధరలపై అసంతృప్తి

- ప్రతి టికెట్‌పై రూ.20 వరకు పెంపు
- అదనపు భారమంటున్న సందర్శకులు


జూ పార్కు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కు ప్రవేశ ధరలు పెంపుపై సందర్శకులు అంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా ఎలాంటి ముందస్తు ప్రకటనలు చేయకుండా టికెట్ ధరలు పెంచిన అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జూ అధికారులు ఈ నెల 11వ తేదీ నుంచి జూ పార్కు ప్రవేశ రుసుం పెంచారు. ఈ విషయం తెలియక కౌంటర్ వద్దకు వెళ్లి సందర్శకులు ఎప్పటిలాగే రూ.50 ఇచ్చి టికెట్ అడుగుతున్నారు. పెద్దలకు రూ.70 అని, పెరిగిన ధరలు బోర్డు చూడాలని కౌంటర్‌లో ఉన్న సిబ్బంది చెప్పడంతో ఆ బోర్డు చూసి అవాక్కవుతున్నారు. అదనపు భారం తగదని ఆవేదన చెందుతున్నారు.

జూలో ప్రవేశ ధరలు ఇలా..

కొత్త ధరలు ప్రకారం ప్రస్తుతం పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.30, వీడియో కెమెరాకు రూ.200, స్టిల్ కెమెరాకు రూ.50, కారుకు రూ.750, విదేశీయులకు పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.100, లోపల బ్యాటరీ వాహనాలకు పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.30 చొప్పున చెల్లించాలి.
పాత ధరలు ఇలా.. : పాత ధరల ప్రకారం జూ లోపలకు ప్రవేశించడానికి పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.10, వీడియో కెమెరాకు రూ.150, స్టిల్ కెమెరాకు రూ.30, కారుకు రూ.500 టికెట్, లోపల బ్యాటరీ వాహనాలకు పెద్ద లకు రూ.50, పిల్లలకు రూ.20 చొప్పున ఉండేవి.

జెడ్‌ఏపీ నిర్ణయం మేరకు ధరల పెంపు

జూ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జెడ్ఏపీ) నిర్ణయం మేరకు ఇటీవల ఇందిరాగాంధీ జూ పార్కు ధరలు పెంచాం. ఇటీవల ఉన్నతాధికారులు నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈనెల 11 నుంచి కొత్త ధరలు అమలు చేస్తున్నాం. జూ పార్కును మరింత అభివృద్ధిపరచాలనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నాం. ఈ విషయం ముందుగా సందర్శకులకు చెప్పలేకపోయాం. దేశంలో అన్ని జూ పార్కుల మాదిరిగానే విశాఖ జూలో కూడా విదేశీయులకు టికెట్ ధరలు ప్రత్యేకంగా నిర్ణయించాం.
– అనంతశంకర్, ఇన్‌చార్జి క్యూరేటర్, జూ పార్కు

టికెట్ రూ.50 అనుకున్నాం..



మా కుటుంబ సభ్యులం ముగ్గురం కలసి జూ పార్కు చూడాలని శుక్రవారం వచ్చాం. ఎప్పటిలాగే ముగ్గురికి ముడు టికెట్లు ఇవ్వాలని కౌంటర్‌లో రూ.150 ఇచ్చాను. ధరలు పెరిగాయని, కొత్త బోర్డు చూడమని సిబ్బంది చెప్పారు. కొత్త ధరల ప్రకారం ముగ్గురికి మరో రూ.60 అదనంగా తీసుకున్నారు. ధరలు పెంచినట్లు ముందుగా తెలియదు.
– డి.రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులు, మధురవాడ

ధరలు పెరిగినట్లు తెలియదు



జూ ధరలు పెరిగినట్లు ముందుగా తెలియదు. పాత ధరలే అనుకుని విజయనగరం నుంచి స్కూల్ పిల్లల్ని తీసుకొచ్చాం. ఇక్కడికి వచ్చిన తర్వాత ధరలు పెరిగాయిని చెప్పడంతో పెద్దలకు, పిల్లలకు కలిపి ముందు అనుకున్న దానికంటే మరింత ఎక్కువ ఖర్చు అయింది. ముందుగానే ధరలు పెరిగిన విషయం తెలిసి ఉంటే దానికి తగినట్లు ప్రణాళిక వేసుకొని జూకి వచ్చేవాళ్లం. లేదంటే మరేదైన చోటుకు పిల్లలను తీసుకెళ్లేవాళ్లం.
సురేష్, విజయనగరం

మహాశివరాత్రికి శైవ క్షేత్రాలు ముస్తాబు


విద్యుత్ దీపాలంకరణలో కాశీ విశ్వేశ్వర ఆలయం

ఏయూ క్యాంపస్: మహాశివరాత్రికి శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. స్థానిక పెదవాల్తేరు వేంకటేశ్వర ఆలయ సముదాయంలో ఉన్న కాశీ విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజాము నుంచి భక్తులకు ప్రత్యేక దర్శనం, అభిషేకాలు నిర్వహించడానికి ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు చర్యలు తీసుకున్నారు. లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. ఆలయాన్ని ఇప్పటికే విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులు స్వయంగా అభిషేకం చేసుకునే అవకాశం ఈ ఆలయంలో ఉంది.
అసంగానంద ఆశ్రమంలో నూతనంగా ఏర్పాటు చేసిన మృత్యుంజయేశ్వర ఆలయంలో శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. శనివారం తెల్లవారుజాము నుంచి భక్తుల స్వహస్తాలతో అభిషేకాలు చేసుకునే అవకాశం ఇక్కడ కల్పించనున్నారు. ఈస్ట్ షిర్డీ ఆలయం సముదాయంలోని శివాలయంలో భక్తుల దర్శనాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బీచ్ రోడ్డు పరిశుభ్రతకు చర్యలు


సీతకొండ వద్ద బీచ్‌రోడ్డును పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

ఆరిలోవ: బీచ్ రోడ్డు పరిశుభ్రతకు తగిన చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. జీ–20 సదస్సుకు సంబంధించి నగరంలో జరుగుతున్న పనుల పరిశీలనలో భాగంగా జీవీఎంసీ అధికారులతో కలసి ఆయన శుక్రవారం పలు ప్రాంతాలలో పర్యటించారు. ఇందులో భాగంగా తెన్నేటిపార్కు, సీతకొండ మీదుగా సాగర్‌నగర్, రుషికొండ వరకు బీచ్‌రోడ్డును పరిశీలించారు. రోడ్డు నుంచి సీ వ్యూ పాయింట్లు, సముద్రం వైపు ఉన్న రెయిలింగ్, విశ్రాంత స్థలాలను తనిఖీ చేశారు. వాటి వద్ద సందర్శకులకు సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీతకొండ ప్రాంతంలో ఎత్తయిన రోడ్డు వద్ద సముద్రం వైపు రక్షణగా రెయిలింగ్, కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ పర్యటనలో ఏడీసీలు వై.శ్రీనివాసరావు, వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కె.ఎస్.ఎల్.జి.శాస్త్రి, డీడీహెచ్ దామోదరరావు, జెడ్సీ కనక మహాలక్ష్మి, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ స్టీల్‌సిటీ అధికారుల వైఖరిపై ఫిర్యాదు


ఆర్టీసీ ఎండీ తిరుమలరావులకు ఫిర్యాదు చేస్తున్న ఎన్‌ఎంయూఏ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

మద్దిలపాలెం: ఆర్టీసీ స్టీల్‌సిటీ డిపో మేనేజర్, చీఫ్ ఇన్‌స్పెక్టర్‌ల నిరంకుశ వైఖరిపై సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఇద్దరి అధికారులపై విజయవాడలోని ఎండీని కలిసి ఫిర్యాదు చేశామని ఆయన పేర్కొన్నారు. వీరిపై గతేడాది కూడా పలుమార్లు ఫిర్యాదు చేశామని వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ సిబ్బందిని ఇబ్బందులు పాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ఎ.విజయకుమార్ పాల్గొన్నారు.

ఖాతాదారులకు ఉత్తమ సేవలే లక్ష్యం


రుణాలు మంజూరు చేస్తున్న కె.నటరాజన్

ఏయూ క్యాంపస్: ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించడమే తమ లక్ష్యమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధికారి కె.నటరాజన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఈస్ట్ పాయింట్ కాలనీలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరగతుల రుణమేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలకు తమ బ్యాంకు అండగా ఉండన్నారు. ఏజీఎం తిలక్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏడు శాఖల్లో వంద మందికి పైగా రుణ గ్రహీతలకు రూ.2 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ బి సుధా, అధికారులు ఎస్.సంతోషి, రంజిత్, రెడ్డి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతాపరెడ్డిపై దాడి హేయమైన చర్య

విశాఖ విద్య: ఆర్జేడీ ప్రతాపరెడ్డిపై దాడి హేయమైన చర్య అని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి. గోపీనాథ్, ఎం. శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో భౌతికదాడులు సరైన పద్ధతి కాదన్నారు. విద్యాశాఖ పనితీరు పురోగతికి ఆర్జేడీ ప్రతాపరెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అలాంటి అధికారికి పీఆర్‌టీయూ అండగా నిలుస్తుందన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి సాయం


లక్ష్మికి చెక్కు అందిస్తున్న సుదర్శనరావు, పరమేశ్వరరావు తదితరులు

ఎంవీపీ కాలనీ: క్యాన్సర్ బారిన పడి ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాదంపూడి లక్ష్మి అనే మహిళకు మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.10 వేలు సాయం అందజేశారు. ఈ మేరకు మానవతా ఏయూ యూనిట్ చైర్మన్ ఆచార్య ఆర్.సుదర్శనరావు.. ఆమెకు శుక్రవారం చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు కుమారులు అంధులు కావడంతో కుటుంబాన్ని లక్ష్మి చక్కదిద్దాల్సిన పరిస్థితి ఉందని, అయితే ఆమెకు క్యాన్సర్ రావడం మరింత బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఆచార్య కె.పరమేశ్వరరావు, కోశాధికారి వీవీఎస్ రామకృష్ణ, ఆచార్య డీవీ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య ఉద్యానవనం సందర్శన


ఉద్యానవనాన్ని సందర్శించిన విద్యార్థులు


పుష్పించిన మూన్ ఆర్కిడ్ పుష్పం

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌లోని జీవ వైవిధ్య ఉద్యానవనాన్ని శుక్రవారం గాజువాకలోని చైతన్య డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థులు సందర్శించారు. వైవిధ్యమైన వృక్షజాతుల వివరాలు తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్ర మహాలక్ష్మి, అధ్యాపకులు రూపా, సూర్య కుమారి పర్యవేక్షణలో సుమారు 40 మంది విద్యార్థులు పార్క్‌ను సందర్శించి విశేషాలు తెలుసుకున్నారు. వీరికి పార్క్ నిర్వాహకుడు మంథా రామ మూర్తి పార్క్ ప్రత్యేకతలు, మొక్కల విశిష్టతలను తెలియజేశారు.
విరబూసిన మూన్ ఆర్కిడ్ : పార్క్ ఆవరణలో ఉన్న మూన్ ఆర్కిడ్ మొక్క పుష్పించింది. తెల్లని వర్ణం కలిగిన ఈ పుష్పాలు కనువిందు చేశాయి. ఆర్కిడేసి జాతికి చెందిన దీని శాస్త్రీయ నామం ఫాలెనోప్సిస్ అమాబిలిస్. ఈ పుష్పాన్ని మోత్ ఆర్కిడ్ అని కూడా పిలుస్తారు.

దేవస్థానం రక్షణ గోడ పనుల అడ్డగింత


దేవస్థానం అధికారులతో వాగ్వాదం చేస్తున్న సింహగిరి కాలనీవాసులు

ఆరిలోవ: సింహాచల దేవస్థానం భూములు ఆక్రమణకు గురికాకుండా చేపడుతున్న రక్షణ గోడ నిర్మాణ పనులను హనుమంతవాక దరి సింహగిరి కాలనీలో కొందరు స్థానికులు అడ్డుకున్నారు. పనులు ఆపేయాలని దేవస్థానం అధికారులతో వాగ్వాదం చేశారు. సింహాద్రి అప్పన్న కొండ చుట్టూ ఎలాంటి ఆక్రమణలు జరగకుండా దేవస్థానం అధికారులు రక్షణ గోడ నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా సింహగిరి కాలనీ వద్ద కొండవాలులో ఖాళీ స్థలాల చుట్టూ గోడ నిర్మాణం కోసం దేవస్థానం అధికారులు ఇటీవల పనులు ప్రారంభించారు. ఈ పనులను శుక్రవారం కొందరు స్థానికులు అడ్డుకున్నారు. ఈ స్థలంలో గతంలో పాకలు ఉండేవని, హుద్‌హుద్ తుపాన్ ధాటికి కూలిపోయాయని అధికారుల దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఆ స్థలాలు తమకు చెందినవి కావడంతో వాటిని విడిచిపెట్టి పక్క నుంచి గోడ నిర్మాణం చేపట్టాలని కోరారు. దీనిపై అధికారులు స్పందించి పక్కా నివాసాలు ఉన్నవాటిని విడిచిపెడుతున్నామని, ఖాళీగా ఉన్న స్థలాలు అన్నీ దేవస్థానానికి చెందినవేనంటూ వివరించారు. దీంతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. ఈ స్థలాలకు సంబంధించిన ఆధారాలు ఉంటే తీసుకురావాలని అధికారులు స్థానికులకు సూచించారు. ఆధారాలు చూపకపోతే గోడ నిర్మించేస్తామని తెలియజేసి ప్రస్తుతం అక్కడ పనులు నిలిపేసి వెళ్లిపోయారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన

ఎంవీపీ కాలనీ: హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. టీటీడీ, హెచ్‌డీపీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఎంవీపీ కాలనీలోని హెచ్‌డీపీపీ కార్యాలయంలో ఈ పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వేంకటేశ్వరస్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌డీపీపీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి నెలా 3వ శుక్రవారం ఈ సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎస్‌కే చంద్రమౌళీశ్వరశర్మ, సీహెచ్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.
పోస్టర్ ఆవిష్కరణ
టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాశివరాత్రి వేడుకల పోస్టర్‌ను ఎంవీపీ కాలనీలోని ధర్మ ప్రచార పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అసిస్టెంట్ సత్యనారాయణ, పి.సత్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి'

ఆరిలోవ: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రూరల్ మండలం తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారుకు ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. ప్రతి నెల 1న జీతాలు చెల్లించాలని, సీపీఎస్ విధానం రద్దు చేయాలని, ఉన్నత తరగతుల్లో 3, 4, 5 తరగతులను విలీనం చేయవద్దని, డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో క్రైమ్ డీసీపీ పర్యటన


పరిశీలిస్తున్న డీసీపీ నాగన్న

బీచ్ రోడ్డు: నగరంలో క్రైమ్ డీసీపీ నాగన్న శుక్రవారం పర్యటించారు. రద్దీ ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, జగదాంబ జంక్షన్, తదితర ప్రాంతాలను పరిశీలించి, అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఈస్ట్ క్రైమ్ సీఐ నాయుడు, ఎస్సై సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ బాధితుడికి పరామర్శ

మహారాణిపేట: జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేటలో డెంగ్యూ వ్యాధితో బాధపడుతున్న బోనం కశ్యప్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు పరామర్శించారు. శుక్రవారం బాలుడు ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. చుట్టుపక్కల దోమల నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌వో పెదజాలరిపేటలో పర్యటించారు. శుక్రవారం ఫ్రైడే–డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, మంచినీటిపై మూతలు సరిగా పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమావతి, ఎపిడిమీయాలజిస్టు యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, సూపర్‌వైజర్ బి.కుమార్, హెల్త్ అసిస్టెంట్ రాజేష్, జీవీఎంసీ మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

సమాచారమ్

కళాభారతిలో నేడు గాత్ర కచేరి

మద్దిలపాలెం: మహాశివరాత్రి సందర్భంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం సాయంత్రం విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గాత్ర కచేరి జరగనుంది. చెన్నైకు చెందిన వివేక్ సదాశివం గాత్ర కచేరి చేయనున్నారని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

శివోహం నృత్యోత్సవం నేడు

మద్దిలపాలెం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం బీచ్ రోడ్‌లోని అన్నమయ్య ప్రాంగణంలో శివోహం నృత్యోత్సవం నిర్వహించనున్నామని నిర్వాహకుడు వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ శాస్త్రీయ నృత్య కళాకారుల సంస్థల ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు.

'ప్రభుత్వ లక్ష్యాల అమలు బాధ్యత ఆశాలదే'


ఆశా కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అమలు చేయాల్సిన బాధ్యత ఆశా కార్యకర్తలపై ఉందని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో ఆశా కార్యకర్తల శిక్షణ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పలువురు ఆశా కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ బి.ఉమావతి, బి.సత్యవతి, ధర్మేంద్ర, హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మి, దిశా పోలీసు స్టేషన్ ఎస్ఐ నీలిమ పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో రైల్వే జీఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా మనోజ్ శర్మ వాల్తేర్ డివిజన్ పరిధి పలాస–విశాఖపట్నం సెక్షన్‌లో డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి శుక్రవారం విండో ఇన్‌స్పెక్షన్ చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా పలాస–విశాఖపట్నం సెక్షన్‌లోని ట్రాక్స్, మలుపులు, వంతెనలు, పాయింట్స్ అండ్ క్రాసింగ్స్, సిగ్నలింగ్, పలు భద్రతా విషయాలను పరిశీలించారు. జీఎం, డీఆర్ఎంలతోపాటు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన వివిధ విభాగాల ప్రిన్సిపల్ హెడ్స్, వాల్తేర్ డివిజన్‌కు చెందిన బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో వైద్యునాథుడి దివ్య దర్శనం


శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న బ్రహ్మకుమారీలు, అతిథులు

బీచ్ రోడ్డు: మహా శివరాత్రి సందర్భంగా బీచ్ రోడ్డులోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రధాన కేంద్రంలో పరమశివుడిని వైద్యునాథుడి రూపంలో ఏర్పాటు చేశారు. మూడు రోజు పాటు సాగనున్న ఈ మహోత్సవాలను గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్ పి.సోమరాజు, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధి శివలీల, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన అవసరం


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రపంచ మానవ హక్కుల సమితి ప్రతినిధులు

ఆరిలోవ (విశాఖ తూర్పు): మానవ హక్కులపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ప్రపంచ మానవ హక్కుల సమితి (డబ్ల్యూహెచ్‌ఆర్‌సీ) జాతీయ చైర్మన్ ఆర్.బాలాజీ సూచించారు. ఆరిలోవ ప్రాంతం హెల్త్ సిటీలోని ఓ హోటల్‌లో మానవ హక్కుల ప్రతినిధుల రాష్ట్ర సమావేశం శుక్రవారం నిర్వహించారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, అవగాహన సదస్సులపై చర్చించారు. అనంతరం సమితి కార్యాచరణతో కూడిన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హక్కులతోపాటు బాధ్యతలు తెలుసుకోవాలని సూచించారు. ప్రతి అంశంపైనా అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలలు, వృద్ధులు, మహిళలు తమకు జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించడానికి ముందుకు రావాలని సూచించారు. సమాజంలో వివక్ష పెరిగిపోతోందని, దాని నుంచి బయటపడడానికి ప్రయత్నించాలన్నారు. యువతలో అవగాహన కలిగించడానికి విద్యార్థులకు కళాశాలల్లో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో విశాఖలోనే మాక్ పార్లమెంట్ కార్యక్రమాలు ప్రారంభిస్తామని తెలిపారు. జాతీయ జనరల్ సెక్రటరీ మధుబాబు, సమితి రాష్ట్ర విభాగం చైర్మన్ బి.కార్తీక్ రామ్, పి.ఎస్.ఆచారి పాల్గొన్నారు.

శాంతి, అహింస భవిష్యత్ తరాలకు అందించాలి


గాంధీజీ జీవిత విశేషాల చిత్రమాలిక ప్రారంభోత్సవంలో జేమ్స్ స్టీఫెన్, తదితరులు

ఏయూ క్యాంపస్: శాంతి, అహింస, కరుణ భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని ఏయూ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. శుక్రవారం ఏయూ గాంధీ అధ్యయన కేంద్రంలో ఏర్పాటు చేసిన గాంధీజీ జీవిత సంగ్రహ ఫొటో గ్యాలరీని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు గాంధీ అధ్యయన కేంద్రంపై అవగాహన కల్పిస్తూ నిర్మాణాత్మక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. గాంధేయవాది రావిప్రోలు సుబ్రహ్మణ్యం ఈ సందర్భంగా జేమ్స్ స్టీఫెన్‌ను సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. అధ్యయన కేంద్రం సంచాలకుడు ఆచార్య చల్లా రామకృష్ణ కేంద్ర కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్, గౌరవ ఆచార్యులు పి.అర్జున్, డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతతో లక్ష్య సాధన సులభం


ప్రసంగిస్తున్న ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి


శోభాయాత్రలో పాల్గొన్న సహజ యోగ సభ్యులు

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఘనంగా సహజ యోగ ప్రదాత నిర్మలాదేవి జయంత్యుత్సవాలు

ఏయూ క్యాంపస్: మనిషికి మానసిక ప్రశాంతత ఉంటే లక్ష్య సాధన సులభమవుతుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సహజ యోగ ప్రదాత మాతాజీ నిర్మలాదేవి శత జయంత్యుత్సవాలు శుక్రవారం ఏయూ స్నాతకోత్సవ మందిరంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను వీసీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవనంలో ప్రజలు అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారన్నారు. ఒత్తిళ్లను జయించేందుకు ప్రతి ఒక్కరు యోగా సాధన, ప్రాణాయామం చేయాలని సూచించారు. ఇటువంటి ఒత్తిడి లేనినాడే మానవుడు అనుకున్నది అత్యంత సులభంగా సాధించగలడని తెలిపారు. ఏయూ యోగా కేంద్రంలో ఎంఏ యోగా విద్యార్థులకు సహజ యోగాపై అవగాహన తరగతులు నిర్వహించాలని సూచించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని వయస్సుల వారికి సహజ యోగా ఒక మానసిక శక్తిని అందించే సాధనంగా మారిందన్నారు. మాతాజీ నిర్మలాదేవి ప్రసాదించిన సహజ యోగ ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చునని చెప్పారు. రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ నిరంతరం సహజ యోగా చేయడం వల్ల ఒత్తిళ్లు దరి చేరవని తెలిపారు. ఈ వేడుకలకు వివిధ రాష్ట్రాల నుంచి సహజ యోగులు హాజరయ్యారు.
వైభవంగా సాగిన శోభాయాత్ర
మూడు రోజుల పాటు జరగనున్న నిర్మలాదేవి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శోభాయాత్ర వైభవంగా సాగింది. కోలాటం, ఆధ్యాత్మిక ప్రదర్శనల మధ్య మాతాజీ నిర్మలాదేవి చిత్రపటాన్ని రథంపై ఉంచి సహజయోగులు శోభాయాత్ర చేపట్టారు. బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్ వద్ద ప్రారంభమైన ఈ శోభాయాత్ర సిరిపురం మీదుగా ఏయూ కాన్వొకేషన్ హాల్ వరకు సాగింది.